


APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర


గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | గురువారం 13 ఆగస్టు 2026 | వెల4/-




# మండలిలో గళంమెత్తాలి.

- సభా సమరానికి వైఎస్సార్‌సీపీ పక్కా ప్లాన్...
- డీఎస్సీపై సిబిఐ విచారణకు డిమాండ్...
- ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తా....
- తాడేపల్లి లో ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలతో జగన్ సమావేశం


అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. డీఎస్సీ అక్రమాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతుల సమస్యలు, పీపీపీ విధానం, బీసీ నేతలపై కేసులు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. మండలిలో పార్టీకి ఉన్న బలాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని, ప్రతి అంశాన్ని ఆధారాలు, గణాంకాలతో సభలో ప్రస్తావించాలని దిశానిర్దేశం చేశారు.




# ఏపీలో మున్సిపల్ ఎన్నికల నగారా

- సెప్టెంబరు 3న వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలు
- కార్పొరేషన్ల వార్డుల జాబితాల ఆధారంగానే తదుపరి కసరత్తు

ఏపీలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు కసరత్తు ప్రారంభమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా నోటిఫికేషన్ జారీ చేస్తూ సెప్టెంబరు 3న అన్ని మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నట్లు ప్రకటించింది. ఈ జాబితాల ఆధారంగానే ఎన్నికల నిర్వహణ, సీట్ల రిజర్వేషన్ల ప్రక్రియ ముందుకు సాగనుంది.




ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు ఎన్నికల ఏర్పాట్లపై నివేదికలు సిద్ధం చేశాయి. కోర్టు వివాదాలు పరిష్కారమైతే ప్రక్రియను వేగంగా ప్రారం భించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాలపై కసరత్తు కొనసాగుతోంది.

## స్థానిక సమరానికి రంగం సిద్ధం

◆కేసులు కొలిక్కి వస్తే.. ఎన్నికలు◆




## తిరుమల ఆధ్యాత్మిక వైభవానికి కొత్త బాట

శ్రీవారి సేవకు శిక్షణ.. ఆచార్యులపై జాతీయ సదస్సు

శ్రీవారి సేవకు 1,888 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ పూర్తయింది. మరోవైపు శ్రీ వైష్ణవ ఆచార్యులపై జాతీయ సదస్సుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది.




## జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడికి కోటి సాయం

- 100 సర్జరీలకు ఇంప్లాంట్లు


జీజీహెచ్‌లో నిరుపేదలకు ఉచిత మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల కోసం ఉన్నతి ఫౌండేషన్ రూ.కోటి విలువైన ఇంప్లాంట్లు, పరికరాలు, సాంకేతిక సహకారం అందించనుంది.

## ఎయిడ్స్‌పై పోరుకు డిజిటల్ బలం

- '95-95-99' లక్ష్యంపై దృష్టి..
- అభా రికార్డులతో వైద్య సేవలకు కొత్త విధానం




ఎయిడ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. డిసెంబరు 1 నాటికి '95-95-99' లక్ష్యాలు సాధించేందుకు 60 రోజుల ప్రచారం ప్రారంభించింది. మరోవైపు ప్రైవేటు వైద్య కళాశాలల్లో అభా ఐడీతో చికిత్స, ఈహెచ్‌ఆర్ నమోదును తప్పనిసరి చేసింది.



వివరాలు 3వ పేజీలో

## పెట్టుబడుల బాటలో ఏపీ

రూ.2.08 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం

రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 20వ ఎస్ఐపీబీ సమావేశంలో 25 ప్రాజెక్టులకు రూ.2,08,406 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా 21,627 మందికి ఉద్యోగాలు రానున్నాయి. డిసెంబరు నుంచి ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాల ద్వారా అందించాలని సీఎం ఆదేశించారు.

## 2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి

543 లోక్‌సభ స్థానాల్లోనే 33 శాతం కోటా

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌ను వేర్వేరుగా చూడాలి: సీఎం విజయ్





మహిళలకు లోక్‌సభలో 33 శాతం రిజర్వేషన్‌ను 2029 ఎన్నికల నుంచే అమలు చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కేంద్రాన్ని కోరారు. ప్రస్తుత 543 స్థానాల్లోనే కోటా కల్పించాలని, డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్‌ను ముడిపెట్టవద్దని అసెంబ్లీ తీర్మానంలో స్పష్టం చేశారు.

## ప్రజల కోసం అసెంబ్లీ తలుపులు

'మన సభ--జన సభ'గా అమరావతి శాసనసభ

ఆగస్టు 14, 15న సాయంత్రం 6 నుంచి 9 వరకు సందర్శనకు అవకాశం



వివరాలు 4వ పేజీలో

ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే శాసనసభను ప్రజలకు చేరువ చేసేందుకు ఏపీ అసెంబ్లీ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'మన సభ--జన సభ' స్ఫూర్తితో ఆగస్టు 14, 15 తేదీల్లో ప్రజలు, విద్యార్థులకు సందర్శనకు అవకాశం కల్పించింది. ఇకపై ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా నాలుగు రోజులపాటు అసెంబ్లీ సందర్శనకు అవకాశం ఇవ్వనున్నారు.

## నేరం చేస్తే నేతైన.. నేరస్తుడే....

- నేరం మారుతోంది.. పోలీసింగ్ కూడా మారాలి
- గోల్డెన్ అవర్ నుంచే దర్యాప్తుకు పునాది..
- రాజకీయ ముసుగులో నేరాలపై ఉక్కుపాదం
- డిజిటల్ క్రైమ్, డ్రగ్స్, మహిళల భద్రతపై ప్రత్యేక నిఘా..
- ఇక నెలనెలా పోలీసుల పనితీరు నివేదిక




మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసింగ్ విధానాన్ని మార్చాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గోల్డెన్ అవర్‌లోనే దర్యాప్తుకు పునాది వేయాలని, రాజకీయ ముసుగులో నేరాలు, డ్రగ్స్, డిజిటల్ నేరాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ప్రతి నెలా పోలీసుల పనితీరు నివేదిక విడుదల చేయాలని సూచించారు.



## రాజధానిలోకి రయ్యిమంటూ..

- రూ.1,519 కోట్లతో ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు
- బకింగ్‌హామ్ కెనాల్‌పై రూ.82 కోట్ల స్టీల్ బ్రిడ్జి ప్రారంభం
- అమరావతి రవాణా వ్యవస్థకు కీలక ముందడుగు

03

రాజధాని నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడుతోంది. రూ.1,519 కోట్లతో చేపట్టిన 21.77 కి.మీ ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు, బకింగ్‌హామ్ కెనాల్‌పై రూ.82 కోట్లతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని సీఎం చంద్రబాబు గురువారం ప్రారంభించనున్నారు.

## పారిశ్రామిక ప్రగతికి ఏపీ దూకుడు

- చెన్నై, కోయంబత్తూరులో పెట్టుబడులపై చర్చలు
- సదస్సుకు పారిశ్రామికవేత్తల సానుకూల స్పందన





వివరాలు 4వ పేజీలో

ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. చెన్నై, కోయంబత్తూరు రోడ్‌షోలకు సానుకూల స్పందన వచ్చిందని, విశాఖ CII సదస్సుకు ఇది ఊతమిస్తుందని చెప్పారు.

## అమరావతి ప్రాజెక్టులకు ఊపు

పవన్‌కు నారాయణ ఆహ్వానం.. రాజధాని పనులపై చర్చ





వివరాలు 4వ పేజీలో

# ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు నగారా

మొదటి పేజీ తరువాయి

అమరావతి: రక్షణ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ మరో కీలక దశకు చేరుకుంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను సెప్టెంబరు 3, 2026న ప్రచురించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. నోటిఫికేషన్ నెం. 401/ఎజుఅ–ఖీ1/2026–1 ద్వారా ఈ ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసినట్లు సమాచారం.మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన వార్డుల వారీ ఓటర్ల జాబితాలే కాకుండా, మేయర్, వార్డు సభ్యుల స్థానాల రిజర్వేషన్ల ఖరారు చేయడానికి కూడా ఈ జాబితాలు కీలకం కానున్నాయి. దీంతో పట్టణ ప్రాంతాల్లో స్థానిక ఎన్నికల రాజకీయ కసరత్తుకు ఈ ప్రక్రియ ప్రాధాన్యం సంతరించుకుంది.

జనవరి 1, 2026 అర్హత తేదీగా..వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల తయారీలో 2026 జనవరి 1ను అర్హత తేదీగా పరిగణించనున్నారు. ఆ తేదీని ఆధారంగా చేసుకుని తాజాగా అందుబాటులో ఉన్న అసెంబ్లీ ఓటర్ల జాబితాలను స్వీకరించి, వాటిని సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల వారీగా విభజించి జాబితాలను రూపొందించనున్నారు.

గతంలోనూ మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఓటర్ల జాబితాలను ఆధారంగా చేసుకుని వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను రూపొందించింది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓటర్ల వివరాల్లో ఎలాంటి అనవసరమైన చేర్పులు, తొలగింపులకు అవకాశం లేకుండా అసెంబ్లీ ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఎన్నికల ప్రక్రియలో కీలకమైన అంశం.

కార్పొరేషన్ కమిషనర్లకు బాధ్యతలు...ప్రతి మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను తయారు చేసి ప్రచురించే బాధ్యతను సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు అప్పగించనున్నారు. తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితాలను ఆధారంగా చేసుకుని వార్డు సరిహద్దులకు అనుగుణంగా ఓటర్ల వివరాలను క్రమబద్ధీకరించాల్సి ఉంటుంది.

జాబితాల తయారీ, పరిశీలన, ప్రచురణ ప్రక్రియలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నారు. గత ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం అసెంబ్లీ ఓటర్ల జాబితాలోని వివరాలను యథాతథంగా మున్సిపల్ వార్డు జాబితాలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

జీవీఎంసీకి ప్రత్యేక విధానం...గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాత్రం జాబితాల తయారీ బాధ్యతను సంబంధిత జోనల్ కమిషనర్లకు అప్పగించనున్నారు. జీవీఎంసీ విస్తీర్ణం, వార్డులు, జోన్ల సంఖ్య దృష్ట్యా ఈ విధంగా ప్రత్యేకంగా బాధ్యతలు కేటాయించినట్లు తెలుస్తోంది.జోన్ల వారీగా ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని సంబంధిత వార్డులకు అనుసంధానిస్తూ ఫొటో ఓటర్ల జాబితాలను రూపొందించాల్సి ఉంటుంది. అనంతరం నిబంధనల ప్రకారం వాటిని ప్రచురించనున్నారు.

రిజర్వేషన్లకూ ఇదే కీలకం...వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణతో మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన మరో ముఖ్యమైన కసరత్తుకు మార్గం సుగమం కానుంది. మేయర్ పదవులు, వార్డు సభ్యుల స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేసే ప్రక్రియలో ఓటర్ల వివరాలు కీలకంగా మారనున్నాయి.రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై అధికారిక ఎన్నికల షెడ్యూల్ వెలువడాల్సి ఉన్నప్పటికీ, ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియ ప్రారంభం కావడం మాత్రం ఎన్నికల ఏర్పాట్ల దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.

రాజకీయ పార్టీల్లోనూ ఆసక్తి...మున్సిపల్ ఎన్నికలపై ఇప్పటికే రాజకీయ పార్టీల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో వార్డుల వారీ ఓటర్ల జాబితాలపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంది. ఓటర్ల జాబితాల్లో పేర్లు, చిరునామాలు, వార్డు మార్పులు తదితర అంశాలను రాజకీయ పార్టీలు పరిశీలించే అవకాశం ఉంది.గతంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల కోసం వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించే ప్రక్రియను చేపట్టింది. ఎన్నికల నిర్వహణతో పాటు రిజర్వేషన్ల ప్రక్రియకు కూడా ఈ జాబితాలు ఉపయోగపడతాయని అప్పటి మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. సెప్టెంబరు 3న ఓటర్ల జాబితాల ప్రచురణ అనంతరం అభ్యంతరాలు, సవరణలు, తదుపరి ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు చేపడుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మండలిలో గళంమెత్తాలి.

మొదటి పేజీ తరువాయి

తాడేపల్లి రక్షణ పొలిటికల్ బ్యూరో...

అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ప్రజా సమస్యలపై సభల్లో గట్టిగా మాట్లాడాలని సూచించారు. డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతుల సమస్యలు, పీపీపీ విధానం, కేసులు తదితర అంశాలను ప్రస్తావించాలని చెప్పారు. ప్రతి అంశాన్ని ఆధారాలు, గణాంకాలతో వివరించి ప్రభుత్వాన్ని నిలదీయాలని దిశానిర్దేశం చేశారు.అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని జగన్ ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్ష హోదా కల్పిస్తే సభలో మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వాల్సి వస్తుందని, అందుకే ఆ హోదా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అసెంబ్లీలో తాము ప్రస్తావించలేని అంశాలను మీడియా సమావేశాల ద్వారా ఆధారాలు, సాక్ష్యాలతో ప్రజల ముందుంచుతానని చెప్పారు.అయితే శాసనమండలిలో పార్టీకి ఉన్న బలాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని ఎమ్మెల్సీలకు సూచించారు. ప్రభుత్వం ప్రస్తావించే అంశాలపై ప్రత్యామ్నాయ వాస్తవాలను ప్రజలకు వివరించాలని అన్నారు. సభకు వెళ్లే ముందు ప్రతి అంశంపై పూర్తిస్థాయిలో కసరత్తు చేయాలని, ఆధారాలు, పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.డీఎస్సీ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న తమ ఆరోపణలను సభలో ప్రస్తావించాలని జగన్ కోరారు. 74 రోజులుగా డీఎస్సీ అంశంపై వివిధ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. డీఎస్సీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఫస్ట్ ర్యాంకు రావడం, మెరిట్ జాబితాల్లో మార్పులు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలను ప్రస్తావించారు. లీకేజీ వ్యవహారం ఎంతవరకు వెళ్లిందో పూర్తిగా తేలాల్సి ఉందన్నారు.డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే విచారణపై నిష్పాక్షికతకు సంబంధించి సందేహాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. స్పోర్ట్స్ కోటాకు సంబంధించి జారీ చేసిన జీవోలు, పరీక్ష లేకుండా ఉద్యోగాలిచ్చిన వ్యవహారం, అనంతరం నిబంధనల్లో మార్పులను సభలో ప్రస్తావించాలని సూచించారు. డీఎస్సీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బకాయిలపై నిలదీత...ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని జగన్ సూచించారు. 13 త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఒక్కో త్రైమాసికానికి సుమారు రూ.700 కోట్ల చొప్పున రూ.9,100 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వసతి దీవెన కింద మరో రూ.3,300 కోట్లు బకాయి ఉన్నాయని తెలిపారు. రెండు పథకాలకు కలిపి రూ.12,400 కోట్ల మేర చెల్లించాల్సి ఉందన్నారు.ప్రభుత్వం రూ.2,900 కోట్లు మాత్రమే చెల్లించిందని, ఇంకా రూ.9 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని జగన్ ఆరోపించారు. ఈ అంశంపై మండలిలో చర్చకు పట్టుబట్టాలని, విద్యార్థుల తరఫున గట్టిగా మాట్లాడాలని ఎమ్మెల్సీలకు సూచించారు.రైతుల సమస్యలపైనా ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పెట్టుబడులు పెట్టిన తర్వాత నీటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ విధానాలపై కూడా ప్రశ్నించాలని సూచించారు. రైతుల సమస్యలను సభలో ప్రధాన అంశంగా తీసుకెళ్లాలని కోరారు.

పీపీపీపై ప్రశ్నలు...కొత్త పీపీపీ విధానంపై జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఇవ్వడం, ప్రైవేటు సంస్థలు తీసుకునే రుణాలపై వడ్డీని ప్రభుత్వం భరించడం, రాయితీలు కల్పించడం వంటి అంశాలను ప్రశ్నించారు. అనంతరం ప్రజల నుంచి యూజర్ ఛార్జీలు వసూలు చేస్తే భారం సామాన్యులపై పడుతుందని వ్యాఖ్యానించారు.తాగునీరు, పాఠశాలలు, ఆస్పత్రులు వంటి ప్రజా సేవలను పీపీపీ పరిధిలోకి తీసుకురావడంపైనా అభ్యంతరం తెలిపారు. ప్రజా సేవల విషయంలో ప్రభుత్వ బాధ్యతను తగ్గించే విధానాలను వ్యతిరేకించాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు.

కేసులపై పోరాటం...శాంతియుత నిరసనలపై కేసులు, దిశ చట్టం రద్దు, బీసీ నాయకులపై కేసుల అంశాలను కూడా సమావేశాల్లో ప్రస్తావించాలని జగన్ చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే కొందరిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. చింతాడ రవి, ముస్తఫా, విరూపాక్షి, కారుమూరు సునీల్ తదితరులపై నమోదైన కేసులను ఆయన ప్రస్తావించారు. ఈ వ్యవహారాలపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవికి తూమాటి మాధవరావును పార్టీ తరఫున ప్రతిపాదిస్తున్నట్లు జగన్ ప్రకటించారు. ఎమ్మెల్సీలంతా ఆయనకు మద్దతు ఇవ్వాలని, ఎన్నిక సజావుగా జరిగేలా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

శ్వేతపత్రాలపై విమర్శ...చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాలపై జగన్ విమర్శలు చేశారు. వాటిలోని అంశాలకు తమ పార్టీ ఆధారాలతో సమాధానాలు ఇచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడే ప్రతి అంశానికి మూలం, ఆధారం చూపించాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవసరమైన సమాచారం, పత్రాలను అందిస్తామని చెప్పారు.గతంలో చంద్రబాబు ప్రకటించిన విజన్--2020ను కూడా జగన్ ప్రస్తావించారు. అప్పటి స్విస్ మంత్రి పాస్కల్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. ప్రభుత్వ ప్రకటనలపై వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉందన్నారు.


ఇతర అంశాలపైనా..జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగుల సమస్యలు, మహిళలకు సంబంధించిన పథకాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, పాఠశాలల మూసివేత, మహిళలకు బ్యాంకు రుణాల తగ్గుదల తదితర అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. ఎన్నికల సమయంలో ప్రకటించిన జీవో నంబర్--3 అమలు, ఆర్టీసీ ప్రైవేటీకరణ ప్రయత్నాలపై కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని జగన్ సూచించారు.సభల్లో మాట్లాడే ప్రతి అంశాన్నీ ముందుగానే అధ్యయనం చేసి, ఆధారాలు, గణాంకాలతో ప్రస్తావించాలని జగన్ పార్టీ సభ్యులకు సూచించారు. ప్రజా సమస్యలను రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా ప్రభుత్వాన్ని సమాధానం చెప్పేలా చర్చను ముందుకు తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

# స్థానిక సమరానికి రంగం సిద్ధం

అమరావతి: రక్షణ న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. పంచాయతీరాజ్, పురపాలక శాఖల అధికారులు ఎన్నికల సన్నద్ధతపై నివేదికలను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సమీక్షలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు వివరించినట్లు సమాచారం. కోర్టుల్లో ఉన్న న్యాయపరమైన వివాదాలు పరిష్కారమైతే ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

పురపాలికలపై కసరత్తు..పురపాలక సంస్థల ఎన్నికలకు సంబంధించి వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాలు, ఇతర ప్రక్రియలపై అధికారులు దృష్టి సారించారు. వార్డుల పునర్విభజనకు సంబంధించిన కేసుల్లో అనుకూల తీర్పులు వస్తే సుమారు 100 పురపాలికల్లో అవసరమైన ప్రక్రియను 20 రోజుల్లో పూర్తి చేయగలమని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఇప్పటికే పదవీకాలం పూర్తయిన 87 పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధత ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివరించినట్లు తెలుస్తోంది.మంగళగిరి--తాడేపల్లి కార్పొరేషన్ సహా కొన్ని స్థానిక సంస్థలకు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాలు కూడా ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపుతున్నాయి. స్థానిక సంస్థలకు సంబంధించిన వివిధ అంశాలపై హైకోర్టులో వ్యాజ్యాలు కొనసాగుతున్నాయి. మంగళగిరి--తాడేపల్లి కార్పొరేషన్‌కు సంబంధించి ఈ ఏడాది కూడా పలు వ్యాజ్యాల్లో న్యాయస్థానం ఆదేశాలు వెలువడ్డాయి.



పంచాయతీల్లో జాబితాలు..గ్రామ పంచాయతీ ఎన్నికలపైనా పంచాయతీరాజ్ శాఖ సన్నాహాలు కొనసాగిస్తోంది. రాష్ట్రంలో 13,341 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాల రూపకల్పన ప్రక్రియను అధికారులు చేపట్టారు. గ్రామ పంచాయతీల ఫొటో ఓటర్ల జాబితాల తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. అసెంబ్లీ ఓటర్ల జాబితాలను ఆధారంగా చేసుకుని పంచాయతీ వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించింది.కోర్టు వివాదాల కారణంగా ప్రక్రియ నిలిచిపోయిన కొన్ని పంచాయతీలను మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు 2026లో జరగాల్సి ఉందని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖకు సంబంధించిన తాజా నివేదికలోనూ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు మార్చి 2026లో, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ఆగస్టు 2026లో జరగాల్సి ఉందని అందులో నమోదైంది.

15 జెడ్పీలపైనా దృష్టి..స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా పరిషత్‌ల ఏర్పాట్లపైనా దృష్టి సారించింది. రాష్ట్రంలోని 15 జెడ్పీలకు అవసరమైన పరిపాలనా, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తాజాగా వెల్లడైంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లను సమన్వయం చేస్తున్నట్లు సమాచారం.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశం కూడా కీలకంగా మారింది. బీసీల రిజర్వేషన్ల కోసం సమకాలీన గణాంకాల ఆధారంగా అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 87 స్థానిక సంస్థల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యం సంతరించుకుంది.


నోటిఫికేషన్‌పై ఉత్కంఠ..స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అయితే నోటిఫికేషన్ జారీకి ముందు వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లు, కోర్టు కేసులు వంటి అంశాలు కొలిక్కి రావాల్సి ఉంది. వీటిలో కీలకమైన న్యాయపరమైన అడ్డంకులు తొలగితే ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉంది.

ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు సన్నాహక ప్రక్రియను కొనసాగిస్తున్న నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారిక నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్‌పై తుది నిర్ణయం రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకోనుంది.

# తిరుమల ఆధ్యాత్మిక వైభవానికి కొత్త బాట

మొదటి పేజీ తరువాయి

తిరుపతి,రక్షణ న్యూస్



తిరుమల--తిరుపతి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు టీటీడీ మరింత ప్రాధాన్యమిస్తోంది. భక్తులకు నాణ్యమైన సేవలు అందించేందుకు శ్రీవారి సేవా గ్రూప్ సూపర్‌వైజర్లకు రెండో విడత 'ట్రైన్ ది ట్రైనర్స్' శిక్షణను పూర్తిచేసింది. మరోవైపు శ్రీ వైష్ణవ ఆచార్యుల సేవలపై జాతీయ సదస్సుకు ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతిలోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక ఉత్సవాలు, సాత్తుమొర వేడుకలు నిర్వహించింది.

**1,888 మందికి శిక్షణ..**శ్రీవారి సేవను మరింత బలోపేతం చేసి భక్తులకు నాణ్యమైన సేవలు అందించాలన్న లక్ష్యంతో టీటీడీ ప్రజాసంబంధాల శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ సహకారంతో నిర్వహించిన 'ట్రైన్ ది ట్రైనర్స్' రెండో విడత శిక్షణ బుధవారం ముగిసింది. జూలై 1న ప్రారంభమైన ఈ కార్యక్రమం 43 రోజులపాటు కొనసాగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఉత్తర భారత రాష్ట్రాలకు చెందిన 1,888 మంది గ్రూప్ సూపర్‌వైజర్లు 10 బ్యాచ్‌లలో శిక్షణ పొందారు.మొదటి విడతలో 1,011 మంది శిక్షణ పొందగా, రెండు విడతల్లో కలిపి దాదాపు 3,000 మంది గ్రూప్ సూపర్‌వైజర్లు శిక్షణ పొందారు. శిక్షణ పొందిన వారు తమ మండలాలు, జిల్లాల్లో ఆన్‌లైన్ ద్వారా శ్రీవారి సేవకు నమోదు చేసుకున్న సేవకులకు తిరుమలకు రాకముందే శిక్షణ అందించేలా కార్యక్రమాన్ని రూపొందించారు.సేవా నైపుణ్యాలు, భక్తిభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడంపై శిక్షణలో ప్రధానంగా దృష్టి పెట్టారు. వేద పాఠశాల అధ్యాపకులు, టీటీడీ వివిధ విభాగాల నిపుణులు శ్రీవారి వైభవం, తిరుమల మహత్యం, పురాణ ప్రాశస్త్యం, పూజలు, కైంకర్యాలు, శ్రీవారి సేవ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

**క్షేత్రస్థాయి అవగాహన..**శిక్షణలో భాగంగా లడ్డూ కౌంటర్లు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, కళ్యాణకట్ట, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, రిసెప్షన్ తదితర ప్రాంతాలను శిక్షణార్థులు సందర్శించారు. భక్తులకు అందుతున్న సేవలు, సేవకుల బాధ్యతలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, వాటిని పరిష్కరించే విధానాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు.ప్రతి బ్యాచ్‌లో సుమారు 200 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు ట్రైనింగ్ కిట్, గ్రూప్ సూపర్‌వైజర్ ట్రైనింగ్ మాన్యువల్ అందించారు. గోవింద నామాలు, భగవద్గీత, శ్రీనివాస గాథ, విష్ణు సహస్రనామం, లక్ష్మీ అష్టోత్తరం, లలితా సహస్రనామం వంటి ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా అందించారు.గ్రూప్ సూపర్‌వైజర్ల పనితీరును పర్యవేక్షించేందుకు ఆగస్టు 1 నుంచి ఐదుగురు విశ్రాంత గెజిటెడ్ అధికారులను ప్రిన్సిపల్ సూపర్‌వైజర్లుగా నియమించారు. వీరు క్షేత్రస్థాయిలో సేవలను పర్యవేక్షిస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోనున్నారు.

**ఆచార్యులపై జాతీయ సదస్సు...**శ్రీ వైష్ణవ ఆచార్యుల ఆధ్యాత్మిక సేవలపై ఆగస్టు 17 నుంచి 19 వరకు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 25 మంది పరిశోధకులు, పండితులు పాల్గొననున్నారు.శ్రీ రామానుజులు, ఆచార్య పుండరీకాక్షులు, శ్రీ గోవింద భట్టర్ (ఎంబార్), శ్రీ దాశరథి (ముదళియాండాన్)ల ఆధ్యాత్మిక సేవలు, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారం, ఆలయ ఆచార సంప్రదాయాల పరిరక్షణలో వారి పాత్రపై పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారు.ఆగస్టు 17న ఉదయం 10 గంటలకు పెద్ద జీయర్, చిన్న జీయర్ స్వామివారి మంగళాశాసనాలతో సదస్సు ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు చర్చలు కొనసాగనున్నాయి.

**కోదండరామాలయంలో వైభవం..**తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహనసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు వైఖానస ఆగమ పద్ధతిలో సహస్ర కలశాభిషేకం జరిగింది. సేవలో పాల్గొన్న గృహస్తులకు ఉత్తరీయం, రవికె, లడ్డూ, వడ ప్రసాదాలను అందించారు.రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హనుమంత వాహనసేవ జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీ కోదండరామస్వామివారు హనుమంత వాహనాన్ని అధిష్ఠించి నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

**గోవిందరాజస్వామికి సాత్తుమొర..**శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ చక్రత్తాళ్వార్ సాత్తుమొర, శ్రీ ప్రతివాది భయంకరన్ అన్నన్ సాత్తుమొర వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శ్రీ వరదరాజస్వామివారు, శ్రీ ప్రతివాది భయంకరన్ అన్నన్ స్వామివార్లను ఉభయ నాంచారులతో కలిసి నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు.

తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తీసుకొచ్చిన అప్పపడి ప్రసాదాన్ని శ్రీకోదండరామాలయం నుంచి శ్రీ లక్ష్మీనారాయణస్వామివారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి సాత్తుమొర నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు, శ్రీ చక్రత్తాళ్వార్ స్వామివార్లకు ఊరేగింపు నిర్వహించారు.

టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# 2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి

చెన్నై, రక్షణ న్యూస్

మహిళలకు లోక్‌సభలో 33 శాతం రిజర్వేషన్‌ను 2029 ఎన్నికల నుంచే అమలు చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను అలాగే కొనసాగిస్తూ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని ఆయన ప్రతిపాదించారు. డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు మహిళా రిజర్వేషన్‌ను వాయిదా వేయకూడదని స్పష్టం చేశారు. తమిళనాడు అసెంబ్లీలో బుధవారం ముఖ్యమంత్రి విజయ్ ప్రవేశపెట్టిన ప్రత్యేక తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్ద శాశ్వతంగా కొనసాగించాలని కేంద్రాన్ని కోరడంతోపాటు, మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత నియోజకవర్గాల ప్రాతిపదికనే అమలు చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ, మహిళా రిజర్వేషన్ రెండింటినీ ఒకదానితో మరొకటి ముడిపెట్టకుండా విడివిడిగా చూడాలని విజయ్ పేర్కొన్నారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన పూర్తయ్యే వరకు నిలిపివేయడం సరికాదన్నది తమిళనాడు ప్రభుత్వ వాదన. లోక్‌సభ స్థానాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తమిళనాడు అసెంబ్లీ ఈ తీర్మానం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు డీలిమిటేషన్ అనంతరం పార్లమెంటరీ ప్రాతినిధ్యం దెబ్బతినే అవకాశం ఉందన్న ఆందోళనను తమిళనాడు ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది.కేంద్రం 2026లో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన బిల్లులను తీసుకొచ్చింది. మహిళా రిజర్వేషన్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే అమలు చేసే అవకాశం కల్పించడమే లక్ష్యమని కేంద్రం పేర్కొంది. అయితే తమిళనాడు ప్రభుత్వం మాత్రం మహిళా కోటాను అమలు చేయడానికి డీలిమిటేషన్ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదని వాదిస్తోంది. తాజా తీర్మానానికి డీఎంకేతో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, వీసీకే మద్దతు తెలిపాయి. ఏఐఏడీఎంకే, పీఎంకే, బీజేపీ వ్యతిరేకించాయి. దీంతో ఈ అంశం తమిళనాడు రాజకీయాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ మరోసారి చర్చకు వచ్చింది

**తీర్మానం కోరుతున్న ప్రధాన అంశాలు:**

లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే కొనసాగించాలి.
మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను 2029 నుంచే అమలు చేయాలి.
ప్రస్తుత 543 స్థానాలపైనే మహిళా కోటాను అమలు చేయాలి.
డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు మహిళా రిజర్వేషన్‌ను వాయిదా వేయకూడదు.
డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ ప్రక్రియలను విడివిడిగా చూడాలి.

# జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడికి కోటి సాయం

గుంటూరు, రక్షణ జీజీహెచ్ న్యూస్



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో నిరుపేదలకు ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు 'ఉన్నతి' ఫౌండేషన్ ముందుకొచ్చింది. సుమారు రూ.కోటి విలువైన ఇంప్లాంట్లు, అవసరమైన పరికరాలు, సాంకేతిక సహకారాన్ని అందించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. వీటితో సుమారు 100 శస్త్రచికిత్సలకు అవసరమైన సామగ్రి అందుబాటులోకి రానుంది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్‌తో ఉన్నతి ఫౌండేషన్ ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ సహకారం అందించేందుకు నిర్ణయించినట్లు డాక్టర్ నరేంద్రరెడ్డి తెలిపారు.

**125 మందికి ఉచితంగా...**దశాబ్దం క్రితం జీజీహెచ్‌లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారితో బుధవారం ఎంసీహెచ్ బ్లాక్‌లోని సమావేశ మందిరంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. శస్త్రచికిత్సలు చేయించుకున్న పలువురు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నృత్యాలు, కోలాటాలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అప్పటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఇచ్చిన స్ఫూర్తితో జీజీహెచ్‌లో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 125 మందికి ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమం తమకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ప్రస్తుతం మరోసారి నిరుపేదల కోసం రూ.కోటి విలువైన ఇంప్లాంట్లు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తానే స్వయంగా జీజీహెచ్‌కు వచ్చి అవసరమైన శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవ చేసే అవకాశం లభించడం గౌరవంగా భావిస్తున్నానన్నారు.

రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే జీజీహెచ్‌లో మెరుగైన మౌలిక వసతులు ఉన్నాయని నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. వాటిని మరింత సమర్థంగా వినియోగించేందుకు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

**ఒక్క ఇన్ఫెక్షన్ కూడా లేదు..**గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ 125 మందికి మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినప్పటికీ ఒక్కరికి కూడా ఇన్ఫెక్షన్ రాకపోవడం వైద్య బృందం అంకితభావానికి నిదర్శనమన్నారు. శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు ప్రస్తుతం ఉత్సాహంగా నడవడం, నృత్యాలు, కోలాటాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు అందించేందుకు డాక్టర్ నరేంద్రరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమం విజయవంతానికి జీజీహెచ్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

**వైద్యులకు కృతజ్ఞతలు...**దశాబ్దం క్రితం మోకీళ్ల మార్పిడి చేయించుకున్న పలువురు తమ అనుభవాలను వైద్యులతో పంచుకున్నారు. గతంలో తీవ్ర నొప్పులతో నడవలేని పరిస్థితి నుంచి ప్రస్తుతం సాధారణ జీవితం గడుపుతున్నామని తెలిపారు. తమకు నొప్పిలేని నడకను అందించిన డాక్టర్ నరేంద్రరెడ్డి, జీజీహెచ్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు వైద్యులతో కలిసి నృత్యాలు, కోలాటాల్లో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైద్యులు, సిబ్బంది వారితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ పి.అనిల్‌బాబు, ప్రొఫెసర్లు డాక్టర్ ఎ.అజయ్, డాక్టర్ కె.శ్రీనివాసరావు, బీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, డాక్టర్ బూసిరెడ్డి ఉన్నతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజధానిలోకి రయ్యిమంటూ..

అమరావతి రక్షణ బ్యూరో..



రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక అడుగు పడుతోంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి రావడంతో విజయవాడ, మంగళగిరి వైపు నుంచి అమరావతికి రాకపోకలు మరింత వేగవంతం కానున్నాయి.

**21.77 కి.మీ.. రూ.1,519 కోట్ల ప్రాజెక్టు...**దొండపాడు నుంచి ప్రారంభమయ్యే ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి మీదుగా మణిపాల్ హాస్పిటల్స్ వద్ద జాతీయ రహదారి-16ను కలుపుతుంది. మొత్తం 21.77 కిలోమీటర్ల పొడవున 60 మీటర్ల వెడల్పుతో ఈ రహదారిని మూడు దశల్లో నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.1,519 కోట్ల వ్యయం చేయనున్నారు. 9 లేన్ల ప్రధాన రహదారితో పాటు ప్రత్యేక బీఆర్టీఎస్ కారిడార్, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రహదారి నిర్మాణంతోపాటే డ్రైనేజీ, మంచినీటి సరఫరా, గ్యాస్, విద్యుత్ వంటి మౌలిక వసతులకు అవసరమైన నెట్‌వర్క్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లు, గ్రీన్‌బెల్ట్‌లతో ఆధునిక నగర రహదారి రూపంలో ఇ-3 కారిడార్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

**34 రహదారులకు అనుసంధానం,,,**అమరావతిలో ఎన్-1 నుంచి ఎన్-17 వరకు ఉన్న రహదారులను ఇ-3 అనుసంధానించనుంది. ఉత్తర--దక్షిణ, తూర్పు--పడమర దిశల్లో గ్రిడ్ తరహాలో రహదారుల వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 34 ప్రధాన రహదారులు కలిపి సుమారు 350 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపడుతున్నారు. భవిష్యత్‌లో రాజధానిలో పెరిగే వాహన రద్దీకి అనుగుణంగా ఈ రహదారుల వ్యవస్థను రూపొందిస్తున్నారు.

**కెనాల్‌పై ఉక్కు వంతెన..**ఇ-3 రోడ్డును విజయవాడ--మంగళగిరి హైవేతో అనుసంధానించేందుకు బకింగ్‌హామ్ కెనాల్‌పై రూ.82 కోట్లతో 478 మీటర్ల పొడవైన నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జిని నిర్మించారు. సీఎం చంద్రబాబు ఈ వంతెనను కూడా గురువారం ప్రారంభించనున్నారు. వంతెన అందుబాటులోకి వస్తే విజయవాడ వైపు నుంచి అమరావతికి చేరుకునే వాహనాలకు మరో కీలక మార్గం అందుబాటులోకి వస్తుంది. కరకట్ట రోడ్డుపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది.

**ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గృహ సముదాయాల పరిశీలన..**సీఎం చంద్రబాబు గురువారం రాజధాని పర్యటనలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల గృహ సముదాయాలను కూడా పరిశీలించనున్నారు. ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి వద్ద ఉదయం 10.35 గంటలకు శిలాఫలకం ఆవిష్కరించి, అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడి నుంచి ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా రాయపూడికి చేరుకుని గృహ సముదాయాలను పరిశీలించనున్నారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే క్రమంలో రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి ప్రారంభంతో రాజధాని నిర్మాణ పనుల్లో మరో కీలక ఘట్టం నమోదుకానుంది.

# ఎయిడ్స్‌పై పోరుకు డిజిటల్ బలం

మొదటి పేజీ తరువాయి

అమరావతి, ఆగస్టు 12:

ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. డిసెంబరు 1 నాటికి '95-95-99' లక్ష్యాలను సాధించేందుకు 60 రోజుల అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. అదే సమయంలో ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ అభా ఐడీ ఆధారంగా చికిత్స, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల నమోదును తప్పనిసరి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. డిజిటల్ పర్యవేక్షణతోపాటు వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించడంపై దృష్టి సారించింది.

**60 రోజుల ప్రచారం...**అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఏపీ శాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ 60 రోజుల ప్రత్యేక సమాచార, విద్య, ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్ఐవీ నియంత్రణలో రాష్ట్రం ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించిందని మంత్రి తెలిపారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో కొత్త హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు 77 శాతం, మరణాలు 87 శాతం తగ్గాయని చెప్పారు. కేంద్రం నిర్దేశించిన '95-95-99' లక్ష్యంలో రాష్ట్రం ప్రస్తుతం 88-87-96.2 శాతం పురోగతిలో ఉందన్నారు. మిగిలిన అంతరాన్ని పూడ్చి డిసెంబరు 1 నాటికి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**'సురక్ష'తో పర్యవేక్షణ...**హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల పురోగతిని జిల్లాల వారీగా తెలుసుకునేందుకు 'సురక్ష డ్యాష్‌బోర్డ్'ను మంత్రి ఆవిష్కరించారు. ఏ జిల్లాలో ఎంత పురోగతి ఉంది? ఎక్కడ లోటు ఉంది? ఏ ప్రాంతంలో ప్రత్యేక దృష్టి అవసరం? వంటి అంశాలను ఈ వ్యవస్థ ద్వారా గుర్తించే అవకాశం ఉంటుంది. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో రాబోయే 60 రోజులపాటు విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. జానపద కళాజాతాలు, కరపత్రాలు, సామాజిక మాధ్యమాలను వినియోగించనున్నారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సిబ్బంది, విద్యాసంస్థలు, మీడియాను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయనున్నారు.

**తల్లి నుంచి బిడ్డకు అడ్డుకట్ట..**గర్భిణీలకు ముందస్తుగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు, చికిత్స అందించడం ద్వారా తల్లి నుంచి బిడ్డకు వైరస్ సంక్రమించకుండా చర్యలు చేపట్టనున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు తెలిపారు. ఏఆర్టీ కేంద్రాల పనితీరును జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో సమీక్షిస్తూ చికిత్సలో ఉన్నవారికి నిరంతర సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్‌రాజ్ తెలిపారు.


**ప్రైవేటు కళాశాలల్లోనూ అభా..**మరోవైపు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల మేరకు ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ అభా ఐడీ ఆధారంగా వైద్య సేవలు అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ స్పష్టం చేశారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బోధనాసుపత్రులు, ఇతర ప్రభుత్వాసుపత్రుల్లో ఇప్పటికే అభా ఐడీ ఆధారంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. దీంతో రోగుల ఆరోగ్య వివరాలతో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్) రూపొందుతున్నాయని చెప్పారు. ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ ఈ విధానాన్ని వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు.

**5.04 కోట్ల అభా ఖాతాలు..**రాష్ట్రంలో ఇప్పటివరకు 5.04 కోట్ల అభా ఖాతాలు సృష్టించగా, వాటికి అనుసంధానంగా 12.7 కోట్ల ఆరోగ్య రికార్డులు నమోదయ్యాయని వీరపాండియన్ తెలిపారు. రోగి ఎన్నిసార్లు ఆసుపత్రికి వెళ్లినా సంబంధిత ఆరోగ్య వివరాలు ఈహెచ్ఆర్‌లో నమోదవుతాయని చెప్పారు. దీంతో గత వైద్య చరిత్ర వైద్యులకు అందుబాటులో ఉండి చికిత్స మరింత సులభతరం అవుతుందని వివరించారు. కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఈ విధానం ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. ఇకపై ఈహెచ్ఆర్ నమోదులో కళాశాలల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని సూచించారు. అభా ఐడీ ఆధారంగా సేవలు, ఈహెచ్ఆర్ నమోదును ఎన్ఎంసీ డ్యాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షిస్తోందని చెప్పారు.

**భవిష్యత్తులో కీలకం..**భవిష్యత్తులో వైద్య కళాశాలలకు సీట్ల మంజూరు, ఇతర అనుమతుల విషయంలో అభా ఖాతాల వినియోగాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని వీరపాండియన్ తెలిపారు. అందువల్ల ప్రైవేటు వైద్య కళాశాలలు ఇప్పటి నుంచే ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధరబాబు మాట్లాడుతూ అభా వ్యవస్థను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌తో అనుసంధానించినట్లు తెలిపారు. హెచ్ఎంఐఎస్ వినియోగంతో రోగి ఆరోగ్య చరిత్ర వెంటనే అందుబాటులోకి వస్తుందని, వైద్యులకు చికిత్స నిర్ణయం తీసుకోవడం సులభమవుతుందని చెప్పారు.

**రికార్డుకు రూ.10 ప్రోత్సాహకం...**ఒక్కో ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డు నమోదుకు కేంద్ర ప్రభుత్వం రూ.10 చొప్పున ప్రోత్సాహకం అందిస్తోందని చక్రధరబాబు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు రూ.150 కోట్ల మేర చెల్లింపులు జరగగా, రాష్ట్రానికి దాదాపు రూ.15 కోట్లు వచ్చినట్లు చెప్పారు. ఇందులో ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించిన మొత్తం రూ.75 లక్షలు మాత్రమేనని వివరించారు. ప్రైవేటు వైద్య కళాశాలలు అభా ఐడీల ద్వారా ఈహెచ్ఆర్ నమోదులో చురుగ్గా పాల్గొనాలని కోరారు. అవసరమైన సాంకేతిక సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. దీంతో ఒకవైపు ఎయిడ్స్ నియంత్రణలో లక్ష్యాలను చేరుకోవడం, మరోవైపు డిజిటల్ ఆరోగ్య రికార్డుల ద్వారా వైద్య సేవలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం సమాంతరంగా దృష్టి సారించింది.

# పెట్టుబడుల బాటలో ఏపీ



అమరావతి,రక్షణ న్యూస్

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పరిశ్రమలను విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాల ద్వారా అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. వీటి ద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం అవసరమే అయినప్పటికీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎంత మేరకు ప్రోత్సాహకాలు ఇవ్వగలమన్న దానిపై స్పష్టమైన విధానం ఉండాలని సీఎం సూచించారు. పరిశ్రమలకు ఇన్సెంటివ్‌లు అందించే ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరిగేలా ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో 363 పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని ప్రభుత్వం తెలిపింది. మొత్తం రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు రానుండగా, వాటి ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కలగనున్నాయని వెల్లడించింది.

**కొత్త రంగాలపై దృష్టి..**రాష్ట్రంలో భవిష్యత్తులో ఉపాధి, ఆర్థిక వృద్ధికి దోహదపడే రంగాలను గుర్తించి పెట్టుబడులను ఆకర్షించాలని చంద్రబాబు సూచించారు. గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా రంగాల్లో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు అవసరమైన విధానాలు, మౌలిక వసతులపై అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అపోహలను నివృత్తి చేయాలని చెప్పారు. పరిశ్రమలు, డేటా సెంటర్లకు సంబంధించి కాలుష్యం, నీటి వినియోగంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని సీఎం పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లకు అవసరమైన నీటి వనరులపై స్పష్టత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీ ఆధారంగా విశాఖలోని పరిశ్రమలకు నీటిని అందించే ప్రణాళికను ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. కొత్త పరిశ్రమలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంత విలువను జోడిస్తున్నాయన్న అంశాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించాలని ఆదేశించారు.

**గ్రామీణ ప్రాంతాలకూ పరిశ్రమలు..**పారిశ్రామిక అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమలు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాతావరణాన్ని అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో మొత్తం 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని సీఎం నిర్దేశించారు. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ద్వారా కుటుంబాలకు స్వయం ఉపాధి, స్థానికంగా ఉద్యోగాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు.

**రక్షణ రంగానికి ప్రాధాన్యం,,,**రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికి గర్వకారణమని చంద్రబాబు అన్నారు. పుట్టపర్తి సమీపంలో రక్షణ రంగ ప్రాజెక్టులు, హిందూపురం పరిసరాల్లో ఏరోస్పేస్ ప్రాజెక్టులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరులో ప్రారంభించేలా పనులు పూర్తి చేయాలని సూచించారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు లాజిస్టిక్స్, ఆధునిక గిడ్డంగులు, కోల్డ్‌చైన్ ప్రాజెక్టులను అనుసంధానం చేయాలని చెప్పారు. రాయలసీమలో ఉత్పత్తి అవుతున్న ఉద్యాన పంటలను అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు రహదారి, రైల్వే, పోర్టు కనెక్టివిటీని మెరుగుపరచాలని ఆదేశించారు. పరిశ్రమలు, వ్యవసాయం, రవాణా రంగాల మధ్య సమన్వయం ఉంటే పెట్టుబడుల ప్రయోజనాలు మరింత విస్తృతంగా ప్రజలకు చేరుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**పర్యాటకానికి ఊతం..**రాష్ట్రానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించేలా ఆతిథ్య రంగంలో కొత్త ప్రాజెక్టులను ప్రోత్సహించాలని సీఎం సూచించారు. హోటళ్లు, రిసార్టులు ప్రత్యేక నిర్మాణ శైలితో పర్యాటక ఆకర్షణగా నిలిచేలా చూడాలని అన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెరగడంతో స్థానిక ఉపాధి అవకాశాలు కూడా విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పెట్టుబడుల ఒప్పందాలు చేసుకున్న సంస్థలు, ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులు వేగంగా కార్యరూపం దాల్చేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సీఎం ఆదేశించారు. ప్రతిపాదనలు ఆమోదం పొందిన తర్వాత వాటి అమలులో ఆలస్యం జరగకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని చెప్పారు.

**భారీ ప్రాజెక్టులకు ఆమోదం..**20వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లిథియం బ్యాటరీలు, బయోగ్యాస్, హోటళ్లు, లాజిస్టిక్స్, ఆగ్రో పరిశ్రమలు తదితర రంగాలకు చెందినవి ఉన్నాయి. విశాఖపట్నం జిల్లాలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా రూ.58,743 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 1,250 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అనకాపల్లి జిల్లాలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ రూ.85,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానుండగా

**1,880 మందికి ఉపాధి లభించనుంది...**విశాఖ జిల్లాలో ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.31,387 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టు చేపట్టనుంది. దీని ద్వారా 1,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. కాకినాడ జిల్లాలో వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.15,000 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ ద్వారా 1,500 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. కర్నూలు జిల్లాలో అగస్త్యా గ్రీన్ ఎనర్జీ రూ.7,799.96 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టును చేపట్టనుంది. 1,000 మందికి ఉద్యోగాలు రానున్నాయి. జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ రూ.1,533 కోట్ల పెట్టుబడితో 250 మందికి, ఓకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్ రూ.616 కోట్లతో 130 మందికి ఉద్యోగాలు కల్పించనున్నాయి. కడప జిల్లా కొప్పర్తి క్లస్టర్‌లో ఏఐఎల్ డిక్సన్ ఇండియా రూ.450 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ప్రాజెక్టు ద్వారా ఏకంగా 7,000 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. తిరుపతి జిల్లాలో మునోథ్ లిథియం బ్యాటరీ రూ.500 కోట్ల పెట్టుబడితో 240 మందికి ఉపాధి కల్పించనుంది.

**ఎంఎస్ఎంఈలపై ప్రత్యేక దృష్టి...**చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడంపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మిగిలిన 37 పార్కులను సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు అనుమతులు, ప్రోత్సాహకాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో వేగంగా నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయాలని సూచించారు. పెట్టుబడులు రావడం మాత్రమే కాకుండా, అవి వాస్తవంగా ఉత్పత్తి ప్రారంభించి ఉద్యోగాలు కల్పించే దశకు చేరే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. మొత్తంగా 20వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కీలకంగా మారనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త పరిశ్రమలతో పాటు రక్షణ, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్, ఆహార శుద్ధి, పర్యాటకం వంటి రంగాలను సమాంతరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# నేరం చేస్తే నేతైన.. నేరస్తుడే.

మొదటి పేజీ తరువాయి

అమరావతి, రక్షణ క్రైమ్ స్పెషల్...

మారుతున్న కాలంతో పాటు నేరాల స్వరూపం కూడా మారుతోందని, అందుకు అనుగుణంగా పోలీసింగ్ విధానంలోనూ సమూల మార్పులు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరం జరిగిన తొలి గంటలోనే పోలీసులు అప్రమత్తమై ఆధారాలను కాపాడటం, నిందితుల ఆచూకీ గుర్తించడం, దర్యాప్తును వేగవంతం చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేయడంతో పాటు డిజిటల్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, మహిళలపై నేరాలు, రాజకీయ ముసుగులో జరిగే నేరాలపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశించారు. డీజీపీ నుంచి క్షేత్రస్థాయి ఎస్‌హెచ్‌ఓ వరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారులతో సీఎం నిర్వహించిన విస్తృత సమీక్షలో పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ, రేంజ్ ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు, డీఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో చంద్రబాబు నేరుగా మాట్లాడారు. పోలీసు శాఖ పనితీరుపై క్షేత్రస్థాయి నుంచి అభిప్రాయాలు తెలుసుకోవడం, లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడమే సమావేశం ప్రధాన ఉద్దేశంగా కనిపించింది. డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు ఒకేసారి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి అని సీఎం పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు, రాష్ట్రానికి పెట్టుబడులు రావడానికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని అన్నారు.

**నేరం జరిగిన తొలి గంటే కీలకం..**నేర దర్యాప్తులో ‘గోల్డెన్ అవర్’ ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని సంరక్షించకపోతే కీలక ఆధారాలు నష్టపోయే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆధారాలను భద్రపరచడం, సంఘటనా స్థలాన్ని ఇతరులు కలుషితం చేయకుండా చూడటం, అనుమానితుల కదలికలను వెంటనే గుర్తించడం వంటి అంశాల్లో పోలీసులు అత్యంత వేగంగా స్పందించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వివేకా హత్య కేసు దర్యాప్తులో సంఘటనా స్థలంలో ఆధారాల పరిరక్షణకు సంబంధించిన లోపాలను ప్రస్తావించిన సీఎం.. పోలీసుల వైపు నుంచి జరిగిన తప్పిదాలు భవిష్యత్ దర్యాప్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రతి కేసును శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేయాలని సూచించారు.

**టెక్నాలజీ పెరిగితే.. నేరాలూ కొత్త రూపాల్లో..**గత రెండేళ్లలో కాగ్నిజబుల్ నేరాలు 14 శాతం తగ్గాయని సీఎం తెలిపారు. అయితే నేరాలు తగ్గుతున్నాయనే కారణంతో పోలీసులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా ద్వారా మోసాలు, వ్యక్తిగత దూషణలు, అసభ్యకర ప్రచారాలు వంటి కొత్త తరహా నేరాలు పోలీసులకు కొత్త సవాళ్లు విసురుతున్నాయని చెప్పారు. నేరస్థులు టెక్నాలజీని వినియోగిస్తున్నప్పుడు పోలీసులు కూడా అదే స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, డీఎన్ఏ డిటెక్షన్,



సీసీ కెమెరాల నెట్‌వర్క్ వంటి ఆధునిక విధానాలను దర్యాప్తులో మరింత విస్తృతంగా వినియోగించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 14,770 సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన కెమెరాలను అనుసంధానించి దాదాపు లక్ష కెమెరాల నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

**రాజకీయ ముసుగులో నేరాలకు చెక్...**పోలీసుల సమీక్షలో రాజకీయ కోణం కూడా ప్రధానంగా చర్చకు వచ్చింది. రాజకీయ పార్టీకి చెందినవారమనే కారణంతో చట్టాన్ని ఉల్లంఘించే స్వేచ్ఛ ఎవరికీ లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏ పార్టీ అయినా రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే పోలీసులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పరామర్శలు, రాజకీయ కార్యక్రమాల పేరుతో రహదారులను గంటల తరబడి దిగ్బంధించడం, మోటారు సైకిళ్లతో విన్యాసాలు చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి చర్యల వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీఎం పేర్కొన్నారు. అంబులెన్సులు, అత్యవసర సేవల వాహనాలు కూడా నిలిచిపోయే పరిస్థితి రాకూడదన్నారు. “రాజకీయ పార్టీ నేతలమని చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్సు ఎవరికీ లేదు” అన్న స్పష్టమైన సందేశాన్ని పోలీసులకు ఇచ్చారు. రాజకీయ ముసుగులో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు, ఇతర సంఘవిద్రోహ శక్తులను ప్రోత్సహించే వారిపైనా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

**గంజాయి.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం..**యువతను మత్తు పదార్థాల బారినుంచి కాపాడటం పోలీసుల ప్రాధాన్య అంశాల్లో ఒకటిగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. గతంలో మద్యం, ఇప్పుడు గంజాయి, డ్రగ్స్ ప్రభావంతో కొందరు యువకులు నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. సోషల్ మీడియా ద్వారా కొందరు రౌడీలు, నేరస్థులు ‘హీరోలుగా’ మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ‘డ్రగ్స్ వద్దు బ్రో’ ప్రచారాన్ని మరింత విస్తృతం చేసి యువతలో అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే నెట్‌వర్క్‌లను గుర్తించి మూలాలను ఛేదించాలని ఆదేశించారు. డ్రగ్స్ నియంత్రణకు జాతీయస్థాయిలో సమన్వయ వ్యవస్థ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

**మహిళల భద్రతపై జీరో టాలరెన్స్...**మహిళలపై నేరాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి బాధితులకు రక్షణ కల్పించడంతో పాటు నేరస్థులపై చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యతగా కాకుండా సామాజిక బాధ్యతగా కూడా మారాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, యువతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**రోడ్డు ప్రమాదాలపైనా ప్రత్యేక దృష్టి...**శాంతిభద్రతలతో పాటు రోడ్డు భద్రత కూడా ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశమని సీఎం పేర్కొన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ‘హాట్‌స్పాట్ ఆడిట్’ నిర్వహించాలని సూచించారు. అవసరమైన చోట రోడ్ ఇంజినీరింగ్ మార్పులు, సైనేజీలు, లైటింగ్ తదితర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే ఉత్తమమని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

**పోలీసులకు స్వేచ్ఛ.. బాధ్యత కూడా..**పోలీసులకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ, గౌరవం కల్పిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. అయితే ఆ స్వేచ్ఛను ప్రజల రక్షణ కోసం మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. పోలీసులు ప్రజల్లో గౌరవాన్ని, సంఘవిద్రోహ శక్తుల్లో భయాన్ని కలిగించేలా పనిచేయాలని అన్నారు. ‘ఫ్రెండ్లీ పోలీసింగ్’ విధానం పూర్తిస్థాయిలో అమలు కావాలని, బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడానికి భయపడే పరిస్థితి ఉండకూడదన్నారు. అదే సమయంలో నేరస్థులతో పోలీసులు రాజీ పడే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.

**ప్రతి నెలా పోలీసుల పనితీరు రిపోర్టు...**ఇకపై పోలీసు శాఖ పనితీరును నెలనెలా సమీక్షించేందుకు ప్రత్యేకంగా పోలీస్ పెర్ఫార్మెన్స్ రిపోర్టు విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నేరాల సంఖ్య, దర్యాప్తు పురోగతి, నేర నిర్ధారణ శాతం, విజయవంతమైన కేసులు, ఉత్తమ విధానాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను అందులో పొందుపరచాలని సూచించారు. పోలీసులు ఒక కేసును ఛేదించినప్పుడు ఆ విజయాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. దీంతో ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో దర్యాప్తులో వైఫల్యాలు ఉంటే వాటిని కూడా గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు.

**ప్రజల నమ్మకమే పోలీసుల అసలైన బలం...**రాష్ట్రంలో శాంతిభద్రతలు అత్యుత్తమ స్థాయిలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటకం అన్నింటికీ శాంతిభద్రతలే పునాది అని చెప్పారు. “పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం.. నేరస్థుల్లో భయం ఉండాలి” అన్న లక్ష్యంతో పనిచేయాలని పోలీసు అధికారులకు సూచించారు. డీజీపీ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు పోలీసు వ్యవస్థకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, శాంతిభద్రతల అదనపు డీజీ ఎన్.మధుసూదనరెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్హా, ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఐజీ రవికృష్ణ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 పోలీస్ స్టేషన్ల నుంచి శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ తదితర విభాగాలకు చెందిన సుమారు 1,650 మంది అధికారులు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు.

# అమరావతి ప్రాజెక్టులకు ఊపు

మొదటి పేజీ తరువాయి

రక్షణ న్యూస్ -- మంగళగిరి:

రాజధాని అమరావతిలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ చేపడుతున్న కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆహ్వానించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం పవన్ కళ్యాణ్‌ను నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజధాని అభివృద్ధి పనులు, గురువారం జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమాలపై చర్చించారు.

**సీడ్ యాక్సెస్ రోడ్డుకు కీలక ప్రాధాన్యం..**రాజధాని అమరావతి వేదికగా గురువారం పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రెండు స్టీల్ బ్రిడ్జిలు, సీడ్ యాక్సెస్ రోడ్డు ఫేజ్--2 పనులకు ప్రారంభోత్సవం జరగనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస సముదాయాలకు సంబంధించిన ప్రాజెక్టులు కూడా కార్యక్రమంలో భాగంగా ఉంటాయని తెలిపారు. అమరావతిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రహదారులు, వంతెనలు, నివాస సముదాయాలు తదితర ప్రాజెక్టులను నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్తున్నామని నారాయణ వివరించారు. రాజధాని ప్రాంతంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే క్రమంలో సీడ్ యాక్సెస్ రోడ్డు కీలకమైన ప్రాజెక్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**నారాయణకు పవన్ అభినందనలు,,**అమరావతిలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్న మంత్రి నారాయణను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. రాజధానిలో మౌలిక వసతులు



అందుబాటులోకి వస్తే అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డు పూర్తయితే రాజధాని ప్రాంతంలో రాకపోకలు మరింత సులభతరం కావడంతోపాటు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు అనుసంధానం మెరుగుపడుతుందని తెలిపారు.

**విశాఖలో ఏనుగుల దినోత్సవం..**అయితే గురువారం విశాఖపట్నంలో ముందుగా నిర్ణయించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ జాతీయస్థాయి వేడుకల్లో తాను పాల్గొనాల్సి ఉందని పవన్ కళ్యాణ్ తెలిపారు. రాష్ట్రంలో జాతీయస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించాలన్న తన అభ్యర్థన మేరకు ఈసారి విశాఖపట్నాన్ని వేదికగా ఎంపిక చేసినట్లు వివరించారు.

రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన ఆహ్వానం మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ సింగ్ యాదవ్ కార్యక్రమానికి హాజరుకానున్నారని పవన్ వెల్లడించారు. రాష్ట్రంలో జాతీయస్థాయిలో ప్రపంచ ఏనుగుల దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

**రెండు కార్యక్రమాలు ఒకేసారి..**ఒకవైపు అమరావతిలో కీలక రాజధాని ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, మరోవైపు విశాఖలో జాతీయస్థాయి ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి నారాయణకు వివరించారు.

రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా చేపడుతున్న ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ భేటీలో ఇరువురు నేతలు చర్చించినట్లు అధికారులు తెలిపారు.

# ప్రజల కోసం అసెంబ్లీ తలుపులు

మొదటి పేజీ తరువాయి

అమరావతి, రక్షణ బ్యూరో



ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే అమరావతి శాసనసభను ప్రజలకు మరింత చేరువ చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నిర్ణయించారు. ‘మన సభ--జన సభ’ స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం వేళల్లో ప్రజలు, విద్యార్థులు అసెంబ్లీ ప్రాంగణాన్ని సందర్శించే అవకాశం కల్పించారు. ఇకపై ఏటా ఆగస్టు 15, జనవరి 26 వేడుకల సందర్భంగా నాలుగు రోజులపాటు ప్రజలకు అసెంబ్లీ సందర్శనకు అవకాశం కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

**విద్యుత్ వెలుగుల్లో అసెంబ్లీ...**ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు అసెంబ్లీ ప్రాంగణాన్ని సందర్శించవచ్చని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన అసెంబ్లీ భవనాన్ని వీక్షించడంతోపాటు ప్రత్యేక పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు.

**విద్యార్థులకు ప్రత్యేక అవకాశం...**దేశ స్వాతంత్ర్య చరిత్ర, ప్రజాస్వామ్య వ్యవస్థపై యువతకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. అవకాశం, సందర్శకుల సంఖ్యను బట్టి అసెంబ్లీ ప్రధాన సమావేశ మందిరాన్ని కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. అయితే భద్రతా కారణాలతో మొబైల్ ఫోన్ల వినియోగంపై పరిమితులు ఉంటాయని స్పష్టం చేశారు.

**నాలుగు రోజులు తెరిచేలా..**ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా అసెంబ్లీని నాలుగు రోజులపాటు సామాన్యులకు అందుబాటులో ఉంచే విధానాన్ని రూపొందిస్తున్నట్లు అయ్యన్నపాత్రుడు తెలిపారు. ప్రజలు, విద్యార్థులు కుటుంబాలతో కలిసి వచ్చి ప్రజాస్వామ్య దేవాలయంగా భావించే శాసనసభను చూసే అవకాశం కల్పించాలన్నదే ఉద్దేశమన్నారు. సందర్శకుల సౌకర్యార్థం పరిమితంగా చెల్లింపు ప్రాతిపదికన ఫుడ్ కోర్టులకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం విద్యాసంస్థల బస్సుల్లో రాకపోకలకు అవకాశం కల్పించడంతోపాటు ఇతర సందర్శకుల కోసం కొన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసే అంశంపై చర్చిస్తున్నట్లు సెక్రటరీ జనరల్ తెలిపారు.

**సభకు రాకుంటే జీతమెందుకు?..**శాసనసభ సమావేశాలకు గైర్హాజరయ్యే ప్రజాప్రతినిధులపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణ ఉద్యోగి విధులకు హాజరు కాకపోతే జీతం తీసుకోలేరని, ప్రజా సమస్యలను చర్చించడం ప్రధాన బాధ్యతగా ఉన్న ఎమ్మెల్యేలు సభకు రాకుండా వేతనాలు, భత్యాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.

గతంలో నాలుగైదు రోజుల పాటు సభకు రాకుండా తర్వాత వచ్చి హాజరు వేసుకునే విధానం ఉండేదని తెలిపారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు డిజిటల్ ఫేస్ రికగ్నిషన్ ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. సభ్యుడు తనకు కేటాయించిన సీటులో కూర్చున్నప్పుడే హాజరు నమోదయ్యేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు.

**కేంద్రం చట్టం తేవాలి...**సభకు గైర్హాజరయ్యే ఎమ్మెల్యేల విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపినట్లు స్పీకర్ తెలిపారు. పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని బార్బడోస్, గోవాలో జరిగిన స్పీకర్ల వేదికల్లో తాను ప్రతిపాదించినట్లు వెల్లడించారు.

**జగన్‌కు ప్రతిపక్ష హోదాపై..**వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష హోదా అంశంపైనా అయ్యన్నపాత్రుడు స్పందించారు. సభలో అవసరమైన సంఖ్యాబలం లేనప్పుడు నిబంధనల ప్రకారం ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదన్నారు. ప్రతిపక్ష హోదా లేని నేతకు ముఖ్యమంత్రితో సమానంగా సమయం కేటాయించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అయితే సభలోని ప్రతి సభ్యుడికి మాట్లాడే అవకాశం నిబంధనల ప్రకారం సమానంగా ఉంటుందని పేర్కొన్నారు.

**సమావేశాలకు సన్నాహాలు,,,**ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఈ నెల 14న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల కార్యదర్శులు, డీజీపీతో పాటు పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు స్పీకర్ తెలిపారు. భద్రత, సభ్యుల హాజరు, సభా నిర్వహణ తదితర అంశాలపై ఈ సమావేశంలో సమీక్షించనున్నారు.

# పారిశ్రామిక ప్రగతికి ఏపీ దూకుడు

మొదటి పేజీ తరువాయి

అమరావతి, రక్షణ న్యూస్

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింత దూకుడుగా ముందుకెళ్తోంది. చెన్నై, కోయంబత్తూరులో నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షోల్లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల నుంచి సానుకూల స్పందన లభించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నవంబరు 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న CII పార్టనర్‌షిప్ సమ్మిట్--2026కు ఈ కార్యక్రమాలు మరింత ఊపునిచ్చాయని చెప్పారు.

**పెట్టుబడులపై దృష్టి...**CII భాగస్వామ్యంతో, ఏపీఈడీబీ సమన్వయంతో చెన్నై, కోయంబత్తూరులో రెండు రోజులపాటు రోడ్‌షోలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ వాణిజ్య సంస్థల ప్రతినిధులకు రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రభుత్వం వివరించింది.

సహజ వనరులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన మౌలిక వసతులు, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, పెట్టుబడులకు అనుకూల విధానాలను పారిశ్రామికవేత్తలకు వివరించినట్లు మంత్రి పేర్కొన్నారు.

**వేగంగా అనుమతులు,,,**రాష్ట్రంలో ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’కు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన సహకారం అందిస్తామని, ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెట్టుబడుల ఆసక్తిని వాస్తవ ప్రాజెక్టులుగా మార్చేందుకు నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

**చెన్నైలో కీలక చర్చలు...**చెన్నైలో జరిగిన సదస్సులో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, ఇండో–జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు, ౨జుజజ,౹ూౠజూ తదితర సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిగినట్లు మంత్రి వెల్లడించారు. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, సాంకేతిక రంగం, నైపుణ్యాభివృద్ధి, ఎంఎస్ఎంఈలకు సంబంధించిన అవకాశాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. ఇసుజు మోటార్స్, హీరో మోటోకార్ప్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఏపీలో తమ అనుభవాలను సానుకూలంగా వివరించారని పేర్కొన్నారు.

**కోయంబత్తూరులోనూ..**కోయంబత్తూరులో జరిగిన సమావేశంలో గోల్డ్ రిఫైనరీ ద్వారా ఎంఎస్ఎంఈ రంగానికి కలిగే అవకాశాలపై ఎమరాల్డ్ జ్యువెలరీ ప్రతినిధులతో చర్చించినట్లు మంత్రి తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్, ఛార్జింగ్ మౌలిక వసతులు, తయారీ, ఎగుమతులు, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన అంశాలపైనా పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిగాయని చెప్పారు.

**విస్తృత అవకాశాలు,,**పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ ఇండస్ట్రీస్, పర్యాటకం, ఆతిథ్య రంగం, తయారీ, పారిశ్రామిక క్లస్టర్లు, పోర్టులు, లాజిస్టిక్స్, ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. చెన్నై, కోయంబత్తూరు రోడ్‌షోలకు లభించిన స్పందన నవంబరులో విశాఖలో జరిగే జ×× పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు మరింత బలాన్ని ఇస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**విశాఖ సదస్సుపై గురి..**నవంబరు 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జ×× పార్టనర్‌షిప్ సమ్మిట్--2026 నిర్వహించనున్నారు. దీనికి ముందస్తుగా దేశంలోని కీలక పారిశ్రామిక కేంద్రాల్లో పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పెట్టుబడిదారుల ఆసక్తిని ప్రాజెక్టులుగా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District